క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఏసు బాటలో నడవాలి



విజయపురిసౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. తోటి వారిని ప్రేమించటం క్రైస్తవంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్యమూర్తి మేరిమాత అని కొనియాడారు. దీనికి ముందు పలువురు భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

వీరమాచినేటి సేవలు మరువలేనివి

మాచర్ల: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశేష సేవలందించిన స్వర్గీయ వీరమాచినేటి సుభాష్‌చంద్రబోస్ చేసిన సేవలు మరువలేనివని రొటేరియన్ డాక్టర్ రామకోటయ్య, తుమ్మల సత్యప్రసాద్, పఠాన్ నాగూర్‌వలి నివాళులర్పించారు. వీరమాచినేటి ఐదవ వర్ధంతిని పురస్కరించుకుని 50 మంది పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అదే విధంగా పట్టణంలోని వివేకానంద అనాథాశ్రమానికి ఇన్వెర్టర్, బ్యాటరీలను అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది చంద్రబోస్ పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రోటరీ క్లబ్ ఫౌండేషన్‌కు రూ.3 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కె.శంకరరావు, ఎల్.వెంకటేశ్వర్లు, ఐక్కుర్తి శంకర్, డాక్టర్ శ్రీకాంత్, చెరుకూరి నరసింహారావు, కర్నాటి వాసు, షేక్ మస్తాన్‌వలి, మేడమ్ నాగేశ్వరరావు, అన్నపరెడ్డి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి జగన్నాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి వారి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంతో ప్రారంభమై 26వ తేదీన ముగుస్తాయన్నారు. ముగింపు రోజున స్వామి వారి కళ్యాణోత్సవం, కుంభాభిషేకం జరుగుతుందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

23న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యల కల్యాణ మహోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఈనెల 23న ఉదయం 11:51 గంటలకు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, కాకాని గోపయ్య స్వాముల 30వ వార్షిక కళ్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

నవరత్న సిరులు

అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగుతోంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చెప్పారంటే.. చేస్తారంతే అనేది నిజం చేస్తూ రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించారు. పేద ప్రజలను ఈ సంక్షేమ పథకాలు ఎంతగానో ఆదుకుంటున్నాయి. మహిళ బాగుంటే కుటుంబం బాగుంటుందని నమ్మిన సీఎం జగన్ దాదాపు ప్రతి పథకాన్ని మహిళల పేరు మీదే అందించారు.



ద్వాక్రా మహిళలకు రుణ మాఫీ చెక్కు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే (ఫైల్)

కారెంపూడి: మండల జనాభా 52,367 మంది కాగా ప్రభుత్వ లబ్ధిదారులు 95,013 మంది. అదేంటి అంటే ఒక్కొక్కరికి ఒకటి కంటే ఎక్కువ పథకాలు అందాయని అర్థం. ఇది నిజం. ఆనాడు నివేసన స్థలాలు వచ్చినా ఇతరత్రా పథకాలు వచ్చినా వారి సంఖ్య వందల్లోనే ఉండేది. అదే నేడు వేలకు చేరింది. సంక్షేమ పథకాలు ఒకటి కంటే ఎక్కువ మండలంలో ప్రతి గడపను పలకరించాయి. ఆ విశేషమేంటో చూద్దాం. అలాగే 16,857 మందికి ఆరోగ్య శ్రీ కార్డులు మంజూరు చేయడంతో పాటు అనారోగ్యానికి గురైన వారికి ఉచితంగా వైద్య సేవలు. ఇంకా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా వేలాది మందికి ఉచిత వైద్య సేవలు. ఇవి కాక నాన్ డీబీటీ ద్వారా 367 మందికి రూ.1.84 కోట్లు, 4,280 మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కోసం రూ.4.62 కోట్లు, 1,745 మందికి రూ.78.56 కోట్ల వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్స్, 6,811 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుకకు రూ.1.91 కోట్లు, వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 2,586 మందికి రూ.14.40 లక్షలు, ఇవి కాక రికార్డు స్థాయిలో 2,632 మందికి ఇంటి స్థలాలు. లేఅవుట్స్ వేసి పట్టాలు అందించడంతో పాటు శాశ్వత హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. ఇంటి స్థలాల విలువ సుమారు రూ.51.72 కోట్లు. మొత్తం లబ్ధి సుమారు రూ.449.78 కోట్లు. అంటే పేదల ఆర్థిక ప్రగతితో పాటు కొనుగోలు శక్తి పెరిగి జీవన ప్రమాణాలు కూడా మెరుగయ్యాయని స్పష్టం అవుతుంది.


ఇటీవల హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందిస్తున్న కారెంపూడి గ్రామ వలంటీర్ సంధ్యారాణి

పథకం	లబ్ధిదారులు	డీబీటీ ద్వారా చేకూరిన లబ్ధి
జగనన్న అమ్మఒడి	6,811	రూ. 34 కోట్లు
జగనన్న వసతి దీవెన	1,295	రూ. 12.41 కోట్లు
జగనన్న విద్యా దీవెన	1,765	రూ. 20.70 కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	6,973	రూ. 33.17 కోట్లు
సున్నా వడ్డీ పంట రుణాలు	2,863	రూ.8.76 కోట్లు
ఉచిత పంటల బీమా	3,628	రూ. 1.47 కోట్లు
ఎస్‌హెచ్‌జీలకు సున్నా వడ్డీ	12,010	రూ. 2.91 కోట్లు
వైఎస్సార్ పెన్షన్ కానుక	7,511	రూ. 135.86 కోట్లు
వైఎస్సార్ చేయూత	2,565	రూ. 19.23 కోట్లు

పథకం	లబ్ధిదారులు	డీబీటీ ద్వారా చేకూరిన లబ్ధి
వైఎస్సార్ ఆసరా	9,450	రూ. 2.82 కోట్లు
వైఎస్సార్ బీమా	54	రూ. 54.75 లక్షలు
వైఎస్సార్ కాపు నేస్తం	372	రూ. 2.76 కోట్లు
జగనన్న చేదోడు	195	రూ. 97.50 లక్షలు
వైఎస్సార్ లా నేస్తం	06	రూ. 14.40 లక్షలు
వైఎస్సార్ వాహన మిత్ర	129	రూ. 64.50 లక్షలు
వైఎస్సార్ కల్యాణ మస్తు	34	రూ. 34.75 లక్షలు
అర్చక, ఇమామ్, మౌజమ్, పాస్టర్లకు ఆర్థిక సాయం	12	రూ. 2.40 లక్షలు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	332	రూ. 3.7 కోట్లు

దేవుడే దారి చూపాడు..

నా భర్త చనిపోయారు. ముగ్గురు ఆడపిల్లలు. వారి బతుకు దెరువు ఎట్టారా దేవుడా అనుకుంటూ వేదన పడుతున్నాను. నెలల గడువులోనే వితంతు పింఛన్ వచ్చింది. చదువుకుంటున్న పిల్లలకు విద్యా, వసతి దీవెనల కింద ఆర్థిక సాయం అందుతోంది. ఇప్పటికి నా కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రూ.4,02,302 ఆర్థిక సాయం అందింది. నాకు ఆ దేవుడు తోడుగా ఉన్నట్లే ఉంది.

– పచ్చిపులుసు నాగలక్ష్మి, తోట బజారు, కారెంపూడి

ఎలా బతకాలనుకుంటుండగా..

నా భర్త చనిపోయారు. పిల్లలకు పెళ్లిళ్లై వెళ్లిపోయారు. నాకు 56 ఏళ్లు వచ్చాయి. ఎట్ట బతకాలిరా దేవుడా అనుకుంటుండగా వితంతు పింఛన్ మంజూరైంది. నెలకు రూ.3 వేలు వస్తున్నాయి. దానికి తోడు వైఎస్సార్ చేయూత ఇప్పటికి మూడు విడతలు రూ.18,750 చొప్పున వచ్చాయి. వైఎస్సార్ ఆసరా అందుతోంది. ఇప్పటికి నాకు రూ.2,13,150 ప్రభుత్వం ద్వారా అందాయి.

– నాయిని నర్సమ్మ, సుద్దగుంతల కాలనీ, కారెంపూడి

అక్రమ మైనింగ్ చేసింది మీరు కాదా?!

మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ


మండల కన్వీనర్ గాంధీ, పక్కన వెంకయ్య

గురజాల : గత ప్రభుత్వం హయాంలో అక్రమ మైనింగ్ చేసి సంపాదించుకున్నది మీరు కాదా అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. ఆయన తన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దాడపు గాంధీ, మాడుగుల మాజీ సర్పంచ్ బండ్ల వెంకయ్యలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అక్రమ మైనింగ్ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు చదివినట్లు ఉందని అన్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వి మైనింగ్ మీరు చేసి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై బురద జల్లడం మంచిది కాదని అన్నారు. మాడుగుల గ్రామంలో జరుగుతున్న మైనింగ్‌కు అనుమతులు ఉన్నాయని లెక్క ప్రకారమే రాయల్టీ కట్టి హైవే రహదారికి మట్టిని వాడుతున్నారన్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే యరపతినేని తెలుసుకోవాలన్నారు. అవినీతికి పాల్పడింది మీరేనని, కాసు మహేష్‌రెడ్డి కాదన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి అక్రమ మైనింగ్ చేసి సంపాదించాల్సిన అవసరం లేదని చెప్పారు. టీడీపీ హయాంలోనే అక్రమ మైనింగ్ జరిగిందని తెలిపారు. ఎవరి హయాంలో అక్రమ మైనింగ్ జరిగిందన్న విషయం ప్రజలకు తెలుసని అన్నారు. అక్రమ మైనింగ్ కేసు సీబీఐ నందు ఎవరిమీద ఉందో తెలుసుకోవాలన్నారు.

నూతన కమిటీ సభ్యులకు సన్మానం


నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


పులిచింతల పునరావాస కేంద్రంలో వైఎస్సార్‌సీపీలోచేరిన వారితో ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర పంచాయతీ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సన్మానించారు. స్థానిక షాదీఖానాలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఆయన సన్మానించి అభినందించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని, ఎన్నికలు ముగిసేంత వరకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే చెప్పారు. నూతన కమిటీ సభ్యులైన వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ మహబూబ్ సుభానీ, ప్రధాన కార్యదర్శులు కొలా జంపాలరెడ్డి, బండ్ల యాకోబు, అఫీషియల్ స్పోక్స్ పర్సన్లు కొమ్ము బుజ్జి, వట్టెం నరేంద్ర, కొమెరబత్తిన ఆనంద్, కార్యదర్శులు షేక్ అబ్దుల్ మునాఫ్, కొలా శ్రీనివాసరెడ్డి, గద్దల కిరణ్, కోశాధికారి గుంజి వెంకట్రావ్, సంయుక్త కార్యదర్శులు సంకురాత్రి వెంకటేశ్వర్లు, కొమ్మా కరుణాకర్, నట్టువ నాగ శ్రీనివాసరావు, బొల్లంపల్లి మరియదాసు, షేక్ నాగుల్‌మీరా, గరికపాటి సైదారావు, నాగరాజు, ముశ్యం శ్రీను, చల్లా లింగయ్య, జగన్నాథం దావీద్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, జిల్లా అధికారప్రతినిధి మునగా శ్రీనివాసరావు, మునగా వెంకి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాల చేరిక

పిడుగురాళ్ల: పట్టణంలోని 5వ వార్డులోని పులిచింతల పునరావాస కేంద్రంలోని 50 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఆదివారం చేరారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న నవరత్నాలతోపాటు గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పనితీరుకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామని దేవనంపల్లి పాస్టర్ తెలిపారు. పులిచింతల పునరావాస కేంద్రంలోని క్రీస్తు దేవాలయం లూథరన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారిలో బుర్ర ఏసుదానం, నాగరాజు, కాటుపల్లి శేఖర్, చిన్న మాధవి, పెద్ద మాధవి, చిన్న ప్రసన్న, పెద్ద ప్రసన్న, యాకోబు, కాశీం, వెంకమ్మ, భూక్యా లక్ష్మీ, భాజీ, మామిడిశెట్టి సైదారావు, భవాని, రామారావు, సైదమ్మ, సురేశ్, శెట్టుపోగు సువర్ణమ్మ, మరికిపూడి జక్రయ్య ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 25 కుటుంబాలు


పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: పల్నాడు జిల్లా కారెంపూడి శివారు కారెంపూడి తండాకు చెందిన 25 కుటుంబాలు టీడీపీ, బీజేపీని వీడి ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తండాకు ఆహ్వానించి, ఘనంగా సన్మానించి వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. కారెంపూడి గ్రామ పంచాయతీ 16వ వార్డు బీజేపీ మెంబర్ రమావతు జాన్‌పాల్ నాయక్ ఆధ్వర్యంలో 25 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ప్రభుత్వ విప్ పీఆర్కే కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అందరం కలసికట్టుగా నడుద్దామని పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని, ప్రజల అభ్యున్నతి కోసం మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పీఆర్కే పిలుపునిచ్చారు. వార్డు మెంబర్ల దగ్గర నుంచి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కూడా ఐక్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. ప్రజల ఇబ్బందులను వారి అవసరాలను గుర్తించి వారి ఉన్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పేదల అభ్యున్నతితో పాటు సమాజంలోని అన్ని వర్గాల ఉన్నతి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ, మాజీ ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, పార్టీ నాయకులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, పాతూరి రామిరెడ్డి, ఎంపీటీసీ పద్మలింగయ్య పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేవలకు అందలం

- నరిలేరు మీ కెవ్వరూ
- వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే కాసు
- దాచేపల్లి, గురజాల, పిడుగురాళ్లలో 'వలంటీర్లకు వందనం'

దాచేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల అభివృద్ధికి దోహదపడ్డాయని, ఈ పథకాల ద్వారా ప్రజల్లో విప్లవం వచ్చిందని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక షాదీఖానాలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సేవా వజ్ర, సేవా రత్న అవార్డు పొందిన వలంటీర్లతోపాటు నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లందరినీ ఎమ్మెల్యే కాసు సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందించేందుకు వలంటీర్లు సైనికుల్లా పనిచేశారన్నారు. మీరు చేస్తున్న సేవలకు మీకు ఎవరు సరిలేరని, మీ పట్టుదల, సంకల్పం ఇతరులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. వలంటీర్లు భయపడకుండా పనిచేయాలని, మీకు మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సామాన్యుడైన వ్యక్తిని ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలిపించే సత్తా జగనన్నకి ఉందని, రేపు ఆ అవకాశం మీ వరకు వస్తుందని చెప్పారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, నాయకులు మునగా శ్రీనివాసరావు, షేక్ సైసావలి, వేముల శ్రీహరి, కనమర్లపూడి గోపి, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నాగుబండి గురువులు, వందనపు వెంకట్రామయ్య, దేవళ్ల లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో హాజరైన వలంటీర్లు



థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ధన్యవాదాలు చెబుతున్న వలంటీర్లు

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించండి

గురజాల : ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సేవలు, పథకాలు పొందిన లబ్ధి వివరాలను ప్రజలకు వివరించే విధంగా పని చేయాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వలంటీర్లకు సూచించారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు ప్రభుత్వం ప్రతి ఏడాది సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరిస్తుందన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటి సారి సీఎంగా బాధ్యతలు చేపట్టి పాలనలో ఎంతో మార్పు తీసుకువచ్చారన్నారు. పాలనలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ఎక్కడా కూడా అవినీతికి తావు లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని కానీ ఆ పరిస్థితి నేడు లేదన్నారు. వలంటీర్లు సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి వివరించాలన్నారు. ప్రలోభాలకు గురిచేసే విధంగా ప్రతిపక్షాల ఆలోచనలు ఉంటాయని వలంటీర్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సామాజిక న్యాయంతో పాలన అందించిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అనంతరం వలంటీర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ అంద్రెయ్య, షేక్ పీర్ అహ్మద్, గడిపూడి పెద చెన్నయ్య, వి.అమరారెడ్డి, షేక్ నాగులుమీరా, కె.గిరిబాబు, కె.శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు మహంకాళీ యశోద దుర్గా, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు బిడ్డల్లా మారిన వలంటీర్లు

పిడుగురాళ్ల: వలంటీర్లు ప్రజలకు బిడ్డల్లా మారారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని భవనాశి కల్యాణ మండపంలో ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా అత్యుత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. వృద్ధులకు, పెన్షన్ దారులకు అయితే వారిని మా బిడ్డలు అయ్యా అని చెప్పే స్థాయికి వలంటీర్లు సేవలు అందించటం అభినందనీయమన్నారు. దేశంలోనే ప్రజలకు సేవలు అందించటంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందంజలో ఉన్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు వారియర్స్‌గా పని చేశారన్నారు. టీడీపీ హయాంలో 40 సంవత్సరాల్లో చేయలేనిది 34 నెలల్లో అభివృద్ధి, ప్రజలకు సేవలను వారి వద్దకే తీసుకొని వచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ఒక్క పిడుగురాళ్ల పట్టణంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది 10 మంది మాత్రమే ఉండేవారు, 17 సచివాలయాలు, మున్సిపాలిటీ, వలంటీర్లు సుమారు 400 మంది సిబ్బంది నేడు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. మార్పు అంటే ఇదే కదా అని అన్నారు. ఇప్పటికే 10 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు కూడా నిర్మిస్తున్నామన్నారు. రూ.500 కోట్లతో వైద్యశాల, కళాశాల నిర్మించటం జరుగుతుందన్నారు. వీటితోపాటు నర్సింగ్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలను త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నావుని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క పిడుగురాళ్ల పట్టణానికి నేరుగా రూ.250 కోట్లు ప్రజల ఖాతాలో జమ అయ్యాయన్నారు. వలంటీర్లు తమ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రావూరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు యల్లారావు, కత్తెరపు రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బీఎస్ గిరికువూర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్ రంజిత్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


వలంటీర్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


దాచేపల్లి షాదీఖానాలో వలంటీర్ వెంకటరత్నంకు అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నేడు వలంటీర్లకు సన్మాన కార్యక్రమం

రెంటచింతల: స్థానిక షాదీఖానాలో మండలంలోని వలంటీర్లకు సోమవారం సాయంత్రం 5 గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెదప్రోలు శంకరరావు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అవార్డుల ప్రదానోత్సవంతో పాటు వారిని ఘనంగా సత్కరించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు వెల్దుర్తిలో వలంటీర్లకు వందనం

వెల్దుర్తి: స్థానిక మండల కేంద్రమైన వెల్దుర్తిలోని టీటీడీ కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని ఎంపీడీఓ నరసింహులు ఆదివారం తెలిపారు. మండలంలోని వలంటీర్లను ఈ కార్యక్రమంలో సన్మానించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వలంటీర్లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. వలంటీర్లకు ఎమ్మెల్యే పీఆర్కే సేవా మిత్ర, సేవా వజ్ర, సేవా రత్న అవార్డులతో పాటు మెమెంటోలు, మెడల్స్ అందించనున్నట్లు తెలిపారు.

గుండాటను నిషేధించాలంటూ ఫిర్యాదు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహస్వామి కల్యాణ మహోత్సవ తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు, గుండాట (బులాంగుల ఆట)ను నిషేధించాలంటూ గ్రామ సర్పంచ్ బి.కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆదివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రతి ఏటా తిరునాళ్ల సందర్భంగా కొంత మంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ జూదం, లాటరీ బోర్డులు, పేకాటలు నిర్వహిస్తుండంతో గ్రామంలోని ప్రజలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సమస్యలను దృష్టిలో ఉంచుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించారు.